News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :348 | ఖమ్మం | శుక్రవారం జనవరి 31, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# జీహెచ్ఎంసీ మీటింగ్‌లో రసాభాస

## నిరసనల మధ్య రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

### బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్ట్

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం, తోపులాట
- మేయర్ సమక్షంలోనే పరస్పరం తోసుకున్న కార్పొరేటర్లు
- జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కార్పొరేటర్ల నిరసన
- బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేసిన పోలీసులు

వివరాలు 2లో..

మేయర్ పోడియాన్ని చుట్టుముట్టిన బీఆర్ఎస్ సభ్యులు






## తిరుమలలో చిరుత కలకలం.. భక్తులకు టీటీడీ కీలక సూచన




తిరుమలలో మరోసారి చిరుత కలకలం రేపింది. గురువారం (జనవరి 30) శిలాతోరణం వద్ద చిరుత సంచరించింది. ఔటర్ రింగు రోడ్డులో సర్వదర్శన క్యూలైన్ అటవీ ప్రాంతంలో భక్తులకు చిరుత కనిపించింది. చిరుతను చూసి భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న

వివరాలు 2లో..

## అమెరికాలో ఘోర ప్రమాదం.. విమానం, హెలికాప్టర్ ఢీ

### అమెరికా విమాన ప్రమాదం.. 67 మందిలో ఒక్కరు కూడా ప్రాణాలతో మిగల్లేదు..!



అమెరికా విమాన ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ విమాన ప్రమాదంలో ఒక్కరూ కూడా ప్రాణాలతో బయటపడ లేదని, అందరూ చనిపోయారని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే 27 మంది మృతదేహాలను విమానంలో,

వివరాలు 2లో..

## ప్రైవేటీకరణ చేయం.. పునర్‌నిర్మిస్తాం

- 2-3 నెలల్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం
- కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి
- గాజువాక కూడలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రులు కుమారస్వామి, భూపతిరాజు శ్రీనివాసవర్మ.



విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని, పునర్‌నిర్మిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మరోసారి స్పష్టం చేశారు. గతేడాది జులై 11న తొలిసారి ప్లాంటును సందర్శించినప్పుడు ఇదే హామీ ఇచ్చానని ఆయన గుర్తుచేశారు. గురువారం విశాఖ చేరుకున్న కేంద్ర మంత్రికి కూటమి నేతలు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. అక్కడినుంచి భారీ ర్యాలీగా స్టీలుప్లాంటు వరకు బ్రహ్మరథం పట్టారు. ప్లాంటును పరిశీలించాక కుమారస్వామి అధికారులు, ఉక్కు కార్మిక ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'విశాఖ ఉక్కు చరిత్ర చాలా పెద్దది. మొదట్లో బాగానే సాగింది.

వివరాలు 2లో..



# సెక్రటేరియట్‌లో నకిలీ ఉద్యోగి

పట్టుకున్న ఎస్పీఎఫ్

రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా ఫేక్ ఐడీ

నిందితుడు ఖమ్మంకు చెందిన భాస్కర్ రావు

సహకరించింది మైనార్టీ

డిపార్ట్ మెంట్ సెక్షన్ ఆఫీసర్ డ్రైవర్ రవి

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం!!

ఇద్దరిని అరెస్టు చేసిన సైఫాబాద్ పోలీసులు

ఎప్పటి నుంచి చేస్తున్నారని ఇంటరాగేషన్



తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నకిలీ ఉద్యోగులు దర్జాగా తిరగడం కలకలం రేపింది. ఫేక్ ఐడీ కార్డు మెడలో వేసుకుని అన్ని సెక్షన్లు తిరుగుతూ హల్చల్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సెక్రటేరియట్ లో ఇటీవల నకిలీ ఉద్యోగులు తిరుగుతున్నారని భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దీంతో నిఘా పెట్టిన ఇంటెలిజెన్స్ శాఖ.. మంగళవారం ఇద్దరు నకిలీ

వివరాలు 2లో..




## జగన్ బంధువుకు గనులు కేటాయించిన గనుల శాఖ కార్యదర్శి... ఏపీ ప్రభుత్వం సీరియస్





- పులివెందులకు చెందిన వెంకటరెడ్డికి బెరైటీస్ గనులను కేటాయించిన ప్రవీణ్ కుమార్
- జగన్‌కు వరుసకు సోదరుడు వెంకటరెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్... సెలవులపై వెళ్లిన ప్రవీణ్ కుమార్

వివరాలు 2లో..

## ఏపీలో ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు

- మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు సవరించాలని నిర్ణయం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ విలువల సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 2లో..

## నేడు ఉస్మానియా ఆసుపత్రికి సీఎం భూమిపూజ

### అత్యాధునిక వైద్య సౌకర్యాలతో నిర్మాణం

ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్‌నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నూతన ఆసుపత్రి నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 2లో..



## హైదరాబాద్‌ను పట్టించుకోని ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?



- హైదరాబాద్ నగరానికి నిధులివ్వడం లేదని ప్రశ్నిస్తే గెంటేస్తారా? అని నిలదీత
- కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు కార్పొరేటర్ల గొంతు నొక్కుతారా? అని ఆగ్రహం
- అరెస్టులతో అణగదొక్కాలని చూస్తే గుణపాఠం తప్పదని హెచ్చరిక

వివరాలు 2లో..

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం..




- సారు కారుకు ఎలక్షన్ ఫియర్!
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి వెనుకడుగు
- స్వంతంత్రులకు మద్దతిచ్చే చాన్స్
- 3 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలే
- పరేషాన్లో పదేండ్లు పాలించిన పార్టీ
- ఎంపీ ఎన్నికల రిజల్ట్ ను గుర్తు చేస్తున్న లీడర్లు
- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ఓటమి
- మరోసారి ఓడిపోవద్దనే పోటీ చేస్తలేరా..? అనే చర్చ

వివరాలు 2లో..

హైదరాబాద్: పదేండ్లు రాష్ట్రాన్ని సాధించిన గులాబీ పార్టీకి ఎలక్షన్ ఫియర్ పట్టుకుంది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ స్థానాలకు నిన్న నోటిఫికేషన్ వెలువడింది. బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ కూడా మిత్రపక్షాలతో కలిసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ పోటీకి వెనుకడుగు వేస్తోందని తెలుస్తోంది. ఆయా స్థానాల నుంచి పోటీ చేసే స్వతంత్రులకు మద్దతివ్వాలని భావిస్తోంది. నిజామాబాద్,

# జీహెచ్ఎంసీ సమావేశంలో గందరగోళం...

జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో గందరగోళం చోటు చేసుకుంది. ఈరోజు బడ్జెట్ ఆమోదం అనంతరం ప్రజా సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ పట్టుబట్టడంతో సభలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి సమక్షంలోనే కార్పొరేటర్లు పరస్పరం తోసుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లను మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న తమ కార్పొరేటర్లను తిరిగి సభకు తీసుకువచ్చాకే సభను కొనసాగించాలని నినాదాలు చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ సభ్యులు మేయర్ పైకి పేపర్లు విసిరారని, అందుకు వారు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల అనంతరం ప్రజా సమస్యలపై చర్చించాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ క్రమంలో మేయర్ బీఆర్ఎస్ కార్పొరేటర్లను సస్పెండ్ చేశారు. వారిని మార్షల్స్ సభ నుంచి బయటకు పంపించగా, వారు జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం..

- మొదటి పేజి తరువాయి

కరీంగనర్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాలకు, వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కేవలం 39 స్థానాలకే పరిమితమైంది. తర్వాత కంటోన్మెంట్ ఉప ఎన్నికలో ఆ సీటు కూడా కాంగ్రెస్ వశమైంది. మిగిలిన 38 మంది ఎమ్మెల్యేల్లో పది మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే తరుణంలో వచ్చిన లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసిన 17 స్థానాల్లో ఒక్క సీటుకూడా గెలువకపోగా పలు చోట్ల డిపాజిట్లు కోల్పోయింది. తర్వాత జరిగిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగులపల్లి రాకేశ్ రెడ్డిని పార్టీ బరిలోకి దించింది. ఆయన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నిక కోసం భారీగా ఖర్చు చేసినప్పటికీ కారు పార్టీకి తకరారు తప్పలేదు. ప్రస్తుతం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ మూడు చోట్ల పోటీకి బీఆర్ఎస్ వెనుకడుగు వేస్తోంది. స్వతంత్రులకు మద్దతు ఇవ్వాలని భావిస్తోంది. ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకున్న బీఆర్ఎస్ మరో సారి ఇబ్బంది పడొద్దనే ఈ నిర్ణయం తీసుకుందనే ప్రచారం సాగుతోంది. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఆరు పార్లమెంటు సెగ్మెంట్ల పరిధిలో 3.41 లక్షల ఓట్లున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ కు ఈ ప్రాంతం కంచుకోటగా ఉంది. ఇంతటి కీలకమైన ప్రాంతాన్ని బీఆర్ఎస్ వదులుకుంటుండటం హాట్ టాపిక్ గా మారింది. ఓటమి భయంతోనే పోటీకి వెనుకంజ వేస్తున్నట్టు చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా పాతికేళ్ల చరిత్ర ఉన్న బీఆర్ఎస్ ఎన్నికల యుద్ధం నుంచి వెనుదిరగడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# అమెరికాలో ఘోర ప్రమాదం.. విమానం, హెలికాప్టర్ ఢీ

- మొదటి పేజి తరువాయి

ఒకరి మృతదేహాన్ని హెలికాప్టర్‌లో గుర్తించినట్లు వాషింగ్టన్ డీసీ ఫైర్ డిపార్ట్మెంట్ చీఫ్ జాన్ ఎ.డొనెల్లీ తెలిపారు.
ఈ విమాన ప్రమాదంలో చనిపోయిన వారిలో రష్యాకు చెందిన స్కేటింగ్ ఛాంపియన్స్ కూడా ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. ఎవజెనియా సిస్కోవా, వాదిమ్ నౌమువ్ అనే రష్యన్ స్కేటింగ్ కపుల్ 1990లో వరల్డ్ ఛాంపియన్స్‌గా నిలిచారు. దురదృష్టవశాత్తూ ఈ ఇద్దరు కూడా అమెరికాలో జరిగిన విమాన ప్రమాదంలో చనిపోయారు. రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో బుధవారం రాత్రి ఆర్మీ హెలికాప్టర్‌ను, 64 మంది ప్రయాణికులతో కూడిన విమానం గాల్లోనే ఢీ కొట్టింది. పీఎస్ఏ ఎయిర్ లైన్స్‌కు చెందిన బొంబార్డియర్ సీఆర్‌జే700 రీజనల్ జెట్, సికోర్స్కీ %ఎ%-60 బ్లాక్ హాక్ ఆర్మీ హెలికాప్టర్‌ను బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో క్రాష్ అయిన విమానం, హెలికాప్టర్ ఎయిర్ పోర్ట్ పక్కనే ఉన్న పోటోమాక్ నదిలో పడిపోయాయి. ప్రమాద సమయంలో విమానంలో 64 మంది ఉండగా, హెలికాప్టర్‌లో ముగ్గురు ఉన్నారు. విమానం కాన్సాస్‌లోని విచిత నుంచి వాషింగ్టన్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విమానం, హెలికాప్టర్ ఢీ కొట్టగానే గాల్లోనే పేలిపోయింది. అమెరికాలో 2009 తర్వాత ప్రయాణికులతో వెళుతున్న విమానాలు ప్రమాదానికి గురైన దుర్ఘటనలు జరగలేదని, మళ్లీ ఇప్పుడే ఈ ఘోరం జరిగిందని తెలిసింది. ఈ దుర్ఘటనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏవియేషన్ అథారిటీపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గాలిలో విమానం ఉందని హెలికాప్టర్‌ను అలర్ట్ చేయడంతో పాటు ప్రమాదం జరగకుండా ఉండాలంటే ఏం చేయాలో హెలికాప్టర్ పైలట్‌కు కంట్రోల్ టవర్ ఎందుకు చెప్పలేదని ఏవియేషన్ అథారిటీని ట్రంప్ ప్రశ్నించారు. ఇది చాలా దురదృష్టకరమైన విషయమని, ప్రమాదం జరగకుండా నిరోధించే అవకాశం ఉన్నప్పటికీ నిరోధించలేకపోవడం ఏమాత్రం బాలేదని ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# ప్రైవేటీకరణ చేయం.. పునర్నిర్మిస్తాం

- మొదటి పేజి తరువాయి

2014లో ఆర్ఐఎన్ఎల్‌కు నవరత్న హోదా కల్పించారు. తర్వాత ప్లాంటు విస్తరణకు వెళ్లారు. 7.1 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి చేయాలని నిర్ణయించాకే ఒడుదొడుకులు మొదలయ్యాయి. నష్టాల్లో ఉన్న ఉక్కును చూసి 2021లో పెట్టుబడుల ఉపసంహరణకు ప్రతిపాదించారు. ప్లాంటు అప్పులు రూ.35 వేల కోట్లకు చేరాయి' అన్నారు.

### గాజువాక కూడలిలో కూటమి శ్రేణుల సందడి ప్రధాని మోదీ లక్ష్యం అదే

'విశాఖ ప్లాంటు పరిస్థితి ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లగా, రెండు విడతలుగా రూ.1,650 కోట్లు ఇచ్చారు. కార్మికులు గతేడాది డిసెంబరులో రెండు ఫర్నేస్‌ల నుంచి 14 వేల టన్నుల ఉత్పత్తి సాధించడంతో కేంద్రానికి నమ్మకం వచ్చింది. రూ.11,440 కోట్ల భారీ ఆర్థికసాయానికి ప్రధాని ఒప్పుకున్నారు. మరో 15-20రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక నిర్ణయిస్తాం. ఈ ఏడాది జూన్, జులై నాటికి మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు అందుబాటులోకి తెచ్చి పూర్తిస్థాయిలో 7.1 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని అందుకుంటాం. కార్మికుల సమస్యలను మరో రెండు, మూడు నెలల్లో పరిష్కరిస్తాం' అని కుమారస్వామి అన్నారు. ప్లాంటుకు అవసరమైన గనులపై ప్రత్యామ్నాయం చూస్తున్నామని తెలిపారు.

### కార్మికుల సహకారం కీలకం

కార్మిక సంఘాలతో జరిగిన భేటీలో వారిని ఉత్సాహపరిచేలా కుమారస్వామి మాట్లాడారు. 'కష్టపడి పనిచేయడం మీ బలం. మీ బలం, ఆశీర్వాదంతో ప్లాంటు పునర్నిర్మాణం విషయంలో విజయం సాధించాను. పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాలని మంత్రివర్గం ఆమోదించిన తర్వాత కేంద్రం ఎన్నడూ వెనకడుగు వేయదు. కానీ, ఆ నిర్ణయాన్ని పక్కనపెట్టి పునర్నిర్మాణానికి అడుగులు వేయడం ఇదే తొలిసారి అని నేను భావిస్తున్నాను' అన్నారు. స్టీలుప్లాంటు సందర్శన సమయంలో కేంద్రమంత్రి ఓ మొక్క నాటారు. ఆయన వెంట కేంద్ర ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, అప్పలనాయుడు, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాజపా నేతలు జీవీఎల్, పీవీఎన్ మాధవ్ తదితరులున్నారు.

### నెల రోజుల్లోనే వచ్చారు

'ఉక్కు మంత్రిగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే ప్లాంటును సందర్శించి అవగాహన చేసుకున్నారు. ప్లాంటు పరిరక్షణ కోసం ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లను ఒప్పించారు. ఆయన పట్టుదల, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమష్టి కృషి కారణంగా ప్యాకేజీ సాధించారు. కుమారస్వామి ఈ పర్యటనలో కార్మికులకు భరోసా ఇచ్చారు. ప్యాకేజీ నిధులు ఎలా ఖర్చు చేయాలనేదానిపై అధికారులతో చర్చించారు' అని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు.

### రాష్ట్రం నుంచి రూ.2వేల కోట్ల దన్ను

'ప్లాంటు లాభాలబాట పట్టేవరకూ నీటిసరఫరా ఛార్జీలు, ఈపీడీసీఎల్ విద్యుత్ బిల్లులు తర్వాత చెల్లించే వెసులుబాటు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇది రూ.2వేల కోట్ల వరకూ ఉండొచ్చు. గత ప్రభుత్వంలో ప్లాంటును ముంచేద్దామనుకున్నారు. కూటమి ప్రభుత్వం దీన్ని నిలబెట్టాలని శ్రమిస్తోంది' అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

### మోదీ, కుమారస్వామిలకు ధన్యవాదాలు

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడి ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి లోకేశ్ ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు.

# నేడు ఉస్మానియా ఆసుపత్రికి సీఎం భూమిపూజ

- మొదటి పేజి తరువాయి

భూమిపూజ చేయనున్నారు. ఉదయం 11.55 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ముఖ్య అధికారులు హాజరు కానున్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ 5 వేల మంది ఓపీ రోగులను చూసేలా.., 30 విభాగాలతో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.

## జగన్ బంధువుకు గనులు కేటాయించిన గనుల శాఖ కార్యదర్శి... ఏపీ ప్రభుత్వం సీరియస్

మాజీ ముఖ్య మంత్రి, వైసీపీ అధినే త జగన్ బంధువు వెంకటరెడ్డికి బెరైటీస్ గనుల కేటా యిం పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ప్రస్తుత గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమా ర్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 14 వరకు సెలవుపై వెళ్లారు. దీంతో, గనుల శాఖ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం జీఏడీ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనాకు అప్పగించింది. ఏపీఎండీసీ ఎండీ బాధ్యతలను కూడా మీనాకే అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పులివెందులకు చెందిన వెంకటరెడ్డికి రాష్ట్ర గనుల శాఖ సంక్రాంతి పండుగ సమయంలో వైఎస్సార్ జిల్లా వేములలో దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే బెరైటీస్ నిల్వలున్న లీజును కట్టబెట్టింది. వెంకటరెడ్డి మాజీ సీఎం జగన్‌కు వరుసకు సోదరుడు అవుతారు. ఈ నెల 15న లీజు కేటాయిస్తూ గనుల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. వైఎస్ వెంకటరెడ్డికి 9.55 హెక్టార్లలో 20 ఏళ్ల కాల వ్యవధితో లీజును మంజూరు చేస్తూ గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## తెలంగాణ సెక్రటేరియట్ లో ఇద్దరు నకిలీ ఉద్యోగులు

- మొదటి పేజి తరువాయి

ఉద్యోగులను అదుపులోకి తీసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన భాస్కర్ రావు, డ్రైవర్ రవి ఫేక్ ఐడీ కార్డులు తయారుచేసి సెక్రటేరియట్ లో దందా చేస్తున్నారు.
సెక్షన్ ఆఫీసుల్లో తిరుగుతూ అక్కడికి వచ్చిన వారిని మాటల్లో పెట్టి వివరాలు రాబడుతున్నారు. వారి పని పూర్తిచేయిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నారు. నకిలీ ఉద్యోగుల సమాచారంతో అప్రమత్తమైన సచివాలయ భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ శాఖ అధికారులు నిఘా పెట్టారు. ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు చాకచాక్యంగా వ్యవహరించి నకిలీ ఉద్యోగులు ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇద్దరినీ సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా చలామణి అవుతున్న భాస్కర్ రావుతో పాటు డ్రైవర్ రవిని పోలీసులు విచారిస్తున్నారు.

## హైదరాబాద్‌ను పట్టించుకోని ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కార్పొరేటర్ల అరెస్ట్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. పాలకమండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించినందుకు కార్పొరేటర్లను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని, కోటి మంది నగర ప్రజల తరఫున ప్రశ్నిస్తే బయటకు గెంటేస్తారా? అని నిలదీశారు. గత సంవత్సరం కేటాయించిన బడ్జెట్ నిధులను కనీసం ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాలపై అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు తమ కార్పొరేటర్ల గొంతును నొక్కుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస ప్రజా సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే ఈ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందన్నారు. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీస్తూనే ఉంటామన్నారు. అరెస్ట్ చేసిన కార్పొరేటర్లను, పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అరెస్టుల పేరుతో ప్రజాప్రతినిధులను అణగదొక్కాలని చూస్తే, ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తిరుమలలో చిరుత కలకలం.. భక్తులకు టీటీడీ కీలక సూచన

- మొదటి పేజి తరువాయి

టీటీడీ, ఫారెస్ట్ ఆఫీసర్లు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు.
చిరుత సంచారం నేపథ్యంలో భక్తులను అలెర్ట్ చేశారు అధికారులు. సర్వదర్శన క్యూలైన్‌లోనూ భక్తులను కాసేపు ఆపారు. భక్తులకు కీలక సూచన చేశారు. భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. భయాందోళనకు గురి కావొద్దని.. ఏదైనా ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

## ఏపీలో ఫిబ్రవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు

- మొదటి పేజి తరువాయి

మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలను సవరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌ను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఆదేశించారు.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆయా ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ ఛార్జీల విలువల పెంపు లేదా తగ్గింపునకు అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కొన్ని చోట్ల రద్దీ నెలకొంది. కొన్ని చోట్ల రాత్రి వేళల్లో కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.
సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ విలువలు, స్ట్రక్చర్ విలువలను సవరించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వం విలువలను భారీగా పెంచిందని భావించిన ఏపీ ప్రభుత్వం, వీటిని సవరించాలని నిర్ణయించింది.

## స్థానిక సంస్థల ఎన్నికలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

రిజర్వేషన్ల పెంపు తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా
ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తం గా పలుచోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే ప్రశ్నకు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగా కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల జాబితాను అధిష్ఠానానికి పంపించామని ఆయన పేర్కొన్నారు.

# దోపిడీ రహిత సమాజ నిర్మాణమే శ్రీనివాస్ రెడ్డికి ఘన నివాళి.

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య ఉద్ఘాటన.
- మొండికుంటలో కొల్లు శ్రీనివాస్ రెడ్డి విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,అశ్వాపురం మండలం, దోపిడీ రహిత సమాజ నిర్మాణమే అమరజీవి కామ్రేడ్ కొల్లు శ్రీనివాసరెడ్డి లక్ష్యం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. గురువారం మొండికుంటలోని సిపిఐ కార్యాలయం వద్ద కొల్లు శ్రీనివాస్ రెడ్డి విగ్రహానికి పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించినారు, అనంతరం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన 10వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగిస్తూ. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ప్రజా పోరాటాలకు నిలువుటద్దం నిర్మించి, అనతి కాలలంలో మృత్యువడి చేరారు,శ్రీనివాస్ రెడ్డి ఆశయ సాధనలో. కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు..

ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా నాయకులు మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సీనియర్ నాయకుడు కందాల వెంకటరెడ్డి సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు. కొండపర్తి ప్రసాద్,దంతాల జగదీష్, ఈనపల్లి పవన్ సాయి, అక్కినపల్లి నాగేంద్రబాబు, దండి నాగేష్, మొండికుంట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సర్వ కృష్ణ, వీపురి శ్రీను, కుటుంబ సభ్యులు కొల్లు లింగారెడ్డి కొల్లు ఆశ, కొల్లు చంద్రశేఖర్ రెడ్డి వికాస్ రెడ్డి, కందాల సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు

# గాంధీజీ వర్ధంతి






పలమనేరు నియోజకవర్గం జనవరి 30 సికే న్యూస్:గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఈరోజు పలమనేరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు బజారు వీధి, వాసవి సర్కిల్ వద్ద, ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవ స్వాతంత్ర ఉద్యమంలో ఆయన పాత్ర గురించి సవివరంగా వివరిస్తూ....

దేశానికి స్వాతంత్రం సంపాదించే క్రమంలో, బ్రిటిష్ వారితో, అనేకమార్గాలలో పోరాడి, తమ ప్రాణాలర్పించిన ఎందరో మహానుభావులు అందరికీ వందనాలని మొదట కొనియాడారు.

స్వాతంత్ర పోరాటంలో గాంధీజీ గాంధీజీ పాత్ర విభిన్నమైనది, అహింసా యుత మార్గంలో బ్రిటిష్ వారిని ఎదుర్కొని దేశానికి స్వాతంత్రం సంపాదించడంలో ప్రముఖ పాత్రను పోషించిన ధీశాలి అని,

క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి అనేక మార్గాలలో....బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన గాంధీజీ వర్ధంతి నేడు అని,

1869 అక్టోబర్ 2న జన్మించిన గాంధీజీ, 1948 జనవరి 30 వరకు జీవించారని

ఢిల్లీలోని బిర్లా మందిర్ కు ప్రార్థనల నిమిత్తమై వెళుతుండగా, నాథూరామ్ గాడ్సే జరిపిన కాల్పుల్లో గాంధీజీ చనిపోయారని,

జనవరి 30 తారీకును షాహిద్ దివస్ (అమరవీరుల దినోత్సవం) జరుపుకుంటారని అంతేకాకుండా, ఈరోజును ఐక్యరాజ్యసమితి కూడా అంతర్జాతీయ అహింసా దినోత్సవం గా ప్రకటించిందని. ఈ సందర్భంగా పలువురు వక్తలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, ఎల్లంపల్లి నరేంద్రబాబు, రాచమడుగు సత్య ప్రకాష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు రమ్య హరీష్ హాలో మరియు ఆ సంస్థ సభ్యులు మరియు ఆర్యవైశ్యులు పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ కి ఘన నివాళులు..

- ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి..
- అమలు గాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్...
- హామీలు అమలు చేయాలని మహాత్మా గాంధీ విగ్రహానికి బి ఆర్ ఎస్ వినతిపత్రం..



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు..

అనంతరం బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు మాయమాటలు చెప్పి 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఈ రోజుకి 420 రోజులు పూర్తి అయినా ఏ ఒక్క హామీ అయిన పూర్తిగా చేసిందా అని మహాత్మా గాంధీ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, కోకన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు,ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు...

ఈ సందర్భంగా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మానె రామకృష్ణ మాట్లాడుతూ అమలు గాని హామీలతో అధికారంలోకి వచ్చి, యువత డిక్లరేషన్, విద్యార్థుల డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, ఎస్సీ డిక్లరేషన్ పేరుతో దేశంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులైన ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ లను రాష్ట్రంలోకి తీసుకువచ్చి విస్తృత ప్రచారం నిర్వహించి అధికారం ఒరగబెడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కోలా రాజు,కొల్లం జయ ప్రేమ్ కుమార్, బత్తుల నరసింహులు, గుంజ ఏడుకొండలు, అయినాల రామకృష్ణ, అంబటి కర్ర కృష్ణ, చిట్టిమల్ల అనిల్ కుమార్ ,యువజన నాయకులు మొరాల డానియల్ ప్రదీప్, కొలిపాక శివ, కీసర యువరాజు, గిరిజన నాయకులు కల్లూరి శ్రీరాములు, బాడిస నాగరాజు, రావూరి రవి కిరణ్, మహిళా విభాగం నాయకులు కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మీ,ప్రియాంక,తెల్లం రాణి తదితరులు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 5,6 తేదీల్లో పాల్వంచలో జరిగే ఎస్ఎఫ్ఐ 4వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి.

- జిల్లా ఉపాధ్యక్షులు యస్. భూపేందర్.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలు పాల్వంచ పట్టణ కేంద్రంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జరుగుతున్న నేపథ్యంలో స్థానిక భద్రచలం పట్టణంలోని ప్రభుత్వ , జూనియర్, డిగ్రీ కాలేజ్ నందు 4వ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు కొప్పుల రవీంద్ర అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు భూపేందర్ మాట్లాడుతూ... జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్నదనీ, పెండింగ్ స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం కోసం, మెస్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు కోసం, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లాలో కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్ గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులు నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, కే జీ బీ వీలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ మరియు ప్రభుత్వ హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసామన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెరిగాయన్నారు. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోందనీ, విద్యార్థుల ను బోర్డు,ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పదవ తరగతి టాలెంట్ టెస్ట్, ఇంటర్మీడియట్



విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్షలు అత్యున్నత ప్రమాణాలతో మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామనీ, విద్యార్థులలో దేశభక్తి భావాలు పెంపొందించడానికి జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు, సమాజం పట్ల అవగాహన కల్పించేందుకు పలు అంశాలపై సెమినార్లు, చర్చాగోష్ఠులు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనేక మంది విద్యార్థి అమరవీరులు ప్రాణ త్యాగం చేసిన త్యాగాల గడ్డపై 4వ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకం అన్నారు. జిల్లా మహాసభలకు జిల్లాలోని 23 మండలాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు, భవిష్యత్తులో జిల్లా విద్యారంగ అభివృద్ధికి అనేక అంశాలపై సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీనీ ఎన్నుకొని నూతన ఒరవడితో విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం జిల్లా మహాసభలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు విద్యార్థి ఉద్యమాన్ని రూపకల్పన చేసి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి పోరాటాలు, ఉద్యమాలు, రూపకల్పన చేయడం జరుగుతుందని ఈ మహాసభల జయప్రదంకై విద్యారంగ బలోపేతానికి శ్రేయోభిలాషులు, మేధావులు, ఉపాధ్యాయులు, అభ్యుదయవాదులు, విద్యార్థులు తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, వినోద్, రవీంద్ర , రాము, ప్రసాద్, కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హెవీ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని అడ్డుకున్న గణేష్ పాడు గ్రామస్తులు .

సి కె న్యూస్ ప్రతినిధి దమ్మపేట 30:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని గణేష్ పాడు గ్రామంలో గురువారం హెవీ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు .నాచారం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని ఉద్దేశంలో విద్యుత్ శాఖ కొత్త హెవీ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని చేపట్టింది .కాంట్రాక్టు దారు కూలీలలో విద్యుత్తు లైనుకు గణేష్ పాడు క్రాస్ రోడ్డు నుండి నాచారం సబ్స్టేషన్కు విద్యుత్ లైన్ నిర్మాణానికి గోతులు తీస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు .మా గ్రామంలో ఈ చిన్న రోడ్లు రోడ్డు పక్కన గోతులు తీస్తే ప్రమాదాలు జరుగుతాయని గతంలో జరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తూ గోతులు తవ్వకాన్ని అడ్డుకున్నారు .ఈ విషయం



తెలిసిన ఆర్ అండ్ బి ఏ ఈ రామిశెట్టి శ్రీనివాసరావు కూడా ఈ రోడ్డు విస్తరణ త్వరలో రోడ్డు పక్కన స్తంభాలు వేస్తే రోడ్డు విస్తరణకు ఆటంకం కలుగుతుంది అని రోడ్డుపై స్తంభాలు పాతడాన్ని వ్యతిరేకించారు. దాంతో స్తంభాలకు గోతులు తవ్వే పనులు నిలిచిపోయాయి.

# పెద్దమ్మతల్లి కి ఘనంగా సువర్ణ పుష్పార్చన.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 30,పాల్వంచ మండలం, కేశవాపురం- జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో గురువారం ను పురస్కరించుకొని అమ్మ వారికి 108 సువర్ణ పుష్పములతో వైభవముగా సువర్ణ పుష్పార్చన నిర్వహించ బడినది. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించ బడినవి. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఇట్టి కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.రజనీకుమారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


# బెస్ట్ స్టూడెంట్స్ అవార్డ్స్ అందజేసిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్



జనవరి 30 ( సీ కే న్యూస్) చేగుంట : చేగుంట జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లోలి గల విద్యార్థులు సరియైన సమయానికి పాఠశాలకు రావడం మంచి అటెండెన్స్ విద్యలో రాణించడం అలాగే ఆటలు పోటీల్లో ముందు ఉండడం మంచి క్రమశిక్షణ కలిగి ఉండడం ఇవి బెస్ట్ స్టూడెంట్ కు ఉండవలసిన లక్షణాలు వీటిని పరిగణలోకి తీసుకొని టెన్త్ క్లాస్ విద్యార్థులను ఇద్దరినీ హై స్కూల్ ఉపాధ్యాయులు సెలెక్ట్ చేయడం జరిగింది విద్యార్థులు , పి ఇందు శ్రీ, వై రేవతి, సెలెక్ట్ అయ్యారు వీరికి బహుమతులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం రఘుపతి, ఉపాధ్యాయులు,రాజేశ్వర్, , సురేందర్, లక్ష్మణ్, వెంకటేష్, మనోహర్, సరస్వతి, శ్రీ వాణి, ఉమ, ఉమాదేవి, రాధా, రమ, ఉమామహేశ్వరి, రమాదేవి, శృతి, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వటం మరిచారు....

అల్లాడి పాల్ రాజ్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,స్తానికు ఏఎంసి కాలనీ నందు మాల మహా నాడు ముఖ్య కార్యకర్తల సమావేశం దేగల శివ అధ్యక్షతన నిర్వహించారు..ఈ సమావేశానికి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... తరాలు మారిన, యుగాలు మారిన దళితుల తలరాతలు మారటం లేదని, ప్రభుత్వం అర్హులు కానీ వారికి డబల్ బెడ్ రూమ్ లు ఇచ్చి పేదలకు డబుల్ బెడ్ రూమ్ మరిచారని అన్నారు. గత 15 సంవత్సరాలుగా అద్దెలకి ఉండే పేదలకు డబల్ బెడ్ రూమ్ దక్క కుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.గత ప్రభుత్వంలో డబల్ బెడ్ రూము ఇల్లు రాని పేదలు ఈ ప్రభుత్వంలో నైనా డబల్ బెడ్ రూములు వస్తాయని ఆశ పడిదే కొంత మంది దళారులు పేదల సొంతింటి కలను సొమ్ము చేసుకుంటూ తమ సామాజిక వర్గానికి ఇచ్చుకుంటూ రాజకీయ బలంతో మేమే నాయకులం మేము చెప్పిందే వేదం అని ఇష్టానుసారం గా వ్యహరిస్తున్నారని అన్నారు. పేదలు అద్దెలు నెలకి 4000 రూపాయలు అద్దె కట్టలేక జీవిస్తున్న వారు చాలా మంది ఉన్నారని, డబల్ బెడ్ రూమ్ ప్రక్రియ ను రెవిన్యూ అధికారులు ఎమ్మార్వో ఆర్ ఐ చొరవ చూడాలి, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పోదెం వీరయ్య పేదల ఇంటి కల నెరవేర్చినందుకు ప్రభుత్వంతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదిగిన ఇప్పించగలరని కోరుతున్నారు.ఈ సమావేశం లో ప్రమీల, రాజు, మేరీ ,బర్ల రామకృష్ణ, దాసరి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి.

● ఎస్పీ రోహిత్ రాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 30,** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల లో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియంలో వాహనదారులకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సూచనలతో సబ్ డివిజన్ పోలీసులు వాహనదారులకు, విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా భారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారు. ఎస్పీ తో పాటు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, కొత్తగూడెం మున్సిపల్ కమీషనర్ శేషాంజనేయ స్వామి, జిల్లా రవాణాధికారి వెంకట రమణలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందుగా విద్యార్థులతో కలిసి అక్కడ రోడ్డు భద్రతా నియమాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ద్వారా దేశంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి చాలామంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. వాహనదారులందరూ హెల్మెట్, సీట్ బెల్ట్ లు ధరించి వాహనాలను నడపాలని కోరారు. ర్యాష్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ లోడ్,రాంగ్ రూట్లో ప్రయాణించడం లాంటి తప్పిదాలతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 500 కు పైగా ఆటో డ్రైవర్లు తమ వాహనాలతో సహా హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ సోదరులు కూడా ఖాకీ యూనిఫామ్ ధరించి ఈ కార్యక్రమానికి హాజరవడం తో ప్రకాశం స్టేడియం ప్రాంగణమంతా ఖాకీమయమైందని అన్నారు. ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలను ఉపయోగించు కోవాలని సూచించారు. పోలీస్ శాఖతో పాటు ప్రజలతో నిరంతరం ప్రత్యక్షంగా సంబంధం కలిగి ఉండేది ఆటో డ్రైవర్లు మాత్రమే అని అన్నారు. పోలీసు వారు సూచించిన నియమాలను పాటించి ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మరియు అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి బాధ్యత గల పౌరులుగా కూడా మెలగాలని కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేల ఆటోలకు సంబంధించి పోలీస్ శాఖ తరపున తయారుచేసిన స్టిక్కర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఆటో డ్రైవర్ల అందరూ కూడా తమ సమాచారంతో కూడిన స్టిక్కర్ల ను కచ్చితంగా అమర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళా బృందం మరియు జిల్లా పౌరసంబంధాల శాఖ కళాకారుల చేత ట్రాఫిక్ అవగాహన పై పాటల రూపంలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,ట్రాఫిక్ ఎస్ఐలు నరేష్, మదార్ మరియు పట్టణ సీఐలు కరుణాకర్, రమేష్,శివ ప్రసాద్ మరియు జూలూరుపాడు సీఐ ఇంద్రశేనారెడ్డి లను శాలువాలతో ఎస్పీ సత్కరించారు.

# ప్రెస్ ముసుగులో గంజాయి స్మగ్లింగ్.....

గంజాయి తరలిస్తూ పట్టుబడిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 30,** మీడియా ముసుగులో నిషేధిత గంజాయి అక్రమ రవాణా చేస్తూ ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్ నార్కోటిక్ పోలీసులకు పట్టుబడ్డారు. కారుకు ప్రెస్ స్టిక్కర్ తగిలించుకుని, గంజాయిని దర్జాగా దాటించేద్దాం అనుకున్నారు. అధికారులకు పక్కా సమాచారం అందడంతో నిఘా పెట్టిన అధికారులు పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ చెక్ పోస్ట్ వద్ద భద్రాచలం నుండి బూర్గంపాడు వైపు వెళ్తున్న కారు హుండాయ్ గ్రాండ్ ఐ 10 ఆస్తా కారు ఏపీ 37 బి యు 5216. రాగా అట్టి కారును తనిఖీ చేయగా అందులో 81.950 కిలో గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనది, అట్టి గంజాయిని తరలిస్తున్నటువంటి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని విచారించగా అట్టి వ్యక్తుల పేర్లు 1) మడవి నంద, తండ్రి. హిర్మా, 41 సం" , కోయ, కూలి, నివాసం. మర్లగూడ (గ్రామం). కుంట తాలూకా సుక్మా జిల్లా, చతిస్గడ్. 2. పండగ వెంకటేశ్వర్లు, తండ్రి. నరసయ్య, 34 సం" , వృత్తి: ప్రెస్ రిపోర్టర్, మాల, నివాసం . సోంపల్లి (గ్రామం). బూర్గంపాడు మండలం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. 3. పండగ రాములు, తండ్రి. నరసయ్య, 46 సం", మాల, వృత్తి: ప్రెస్ రిపోర్టర్ , సోంపల్లి ((గ్రామం), బూర్గంపాడు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. తదుపరి విచారణ నిమిత్తం ముగ్గురు వ్యక్తులను గంజాయిని మరియు కారును భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్కు అప్పగించినారు. పట్టుబడిన వ్యక్తులు బూర్గంపహాడ్ మండలంలో పత్రికా విలేకరులు కావడం గమనార్హం. పట్టుబడిన గంజాయి విలువ రు. 20,25,000/- ఉంటుందని అధికారులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం ముగ్గురు వ్యక్తులను గంజాయిని మరియు కారును భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్కు అప్పగించినారు. తదుపరి వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

# శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారక సాయిబాబా మందిరంలో రామయ్య కళ్యాణం నకు గోటి తలంబ్రాలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాల కు ఎంతో విశిష్టత ఉంది కళ్యాణ తలంబ్రాలను భక్తులు భక్తి శ్రద్ధలతో తమ చేతి గోటితో వడ్లను వలచి తలంబ్రాలుగా తయారు చేస్తారు, అలాంటి మహత్తర కార్యాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,బూర్గంపాడు మండలం ,సారపాక లోని శ్రీశ్రీశ్రీ శిరిడి పుష్కర ద్వారక సాయి బాబా వారి మందిరంలో ధర్మ జాగరణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యంలో పుష్కర సాయి బాబా మందిర కమిటీ సౌజన్యంతో గురువారం గోటి తలంబ్రాలు తయారు చేయడం జరిగినది, ఉదయం బాబా వారికి ప్రత్యేక పూజలు అనంతరం గోటి తలంబ్రాలు కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవమునకు గోటి తలంబ్రాలు తయారు చేయడం ఎంతో అదృష్టం, అలాంటి అదృష్టం మాకు కలిగినందుకు చాలా సంతోషంగా ఉంది, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు, ఎంతో నియమ నిష్ఠలతో భక్తి శ్రద్ధలతో గోటితో వడ్లను వలచి తలంబ్రాలుగా తయారు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ రామయ్య తండ్రి కళ్యాణం నకు మా ఆలయంలో గోటి తలంబ్రాలు తయారు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు, ముమ్ముందు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరెన్నో చేయనున్నామన్నారు, ఇలాంటి అవకాశం కల్పించిన ధర్మ జాగరణ సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తు న్నామన్నారు . ఈ కార్యక్రమంలో మందడి హనుమంతరావు, సింగమనేని విజయ భాస్కరరావు, ఇండ్ల శ్రీనివాసరావు ,అక్కర భాస్కరాచారి ,కొత్తపల్లి సత్యనారాయణ ,కృష్ణారావు, నాగేశ్వరరావు , రామకృష్ణ, రామ్మోహన్ రెడ్డి ,రమణ మూర్తి , రాంబాబు భద్రాచలం , మేడూరి వెంకట సుబ్రహ్మణ్యం, మరియు భక్తులు మహిళలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు ఆదర్శవంతులుగా నిలవండి జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్ చలపతి రాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ దుమ్ముగూడెం ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,** నేటి విద్యార్థులు రేపటి భవిష్యత్ తరాలకు ఆదర్శవంతంగా నిలవాలని జిల్లాసైన్స్ అధికారి ఎస్ చలపతి రాజు కోరారు గురువారం దుమ్ముగూడెం లో గత మూడు రోజులుగా నిర్వహించిన నేచర్ క్యాంప్ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిశీలించడం ద్వారా అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని, ప్రకృతిని అవగాహన చేసుకుని ఎలాంటి ఆటంకము కలగకుండా ప్రస్తుతం ఉన్న ప్రకృతిని తరతరాలుగా అందించాలని ఆయన కోరారు తాము నేర్చుకున్న విషయాలు పాఠశాలలకు వెళ్లి మిగిలిన విద్యార్థులకు కూడా ప్రకృతి పట్ల అవగాహన కలిగించాలని సూచించారు గత మూడు రోజులుగా దుమ్ముగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న అడవులు, హైడర్ ప్రాజెక్ట్, గోదావరి పరివాహక ప్రాంతం, గోదావరి జలాలు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ముఖ్యంగా మొక్కలు ఏ విధంగా నాటాలి, ఏ విధంగా సంరక్షించాలి అనే అంశంపై ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో ఎన్జీసి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎం రాజశేఖర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శోభారాణి గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ మార్గం అనుసరణీయం.

● పొదెం వీరయ్య చైర్మన్, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**భారత జాతిపిత గాంధీ మార్గం అనుసరణీయమని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య వ్యాఖ్యానించారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం భద్రాచలం పట్టణం లోని కూరగాయ మార్కెట్ సెంటర్ లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ...భారత జాతీయ ఉద్యమంలో గాంధీజీ నిర్వహించిన పాత్రను గుర్తు చేశారు. బ్రిటిష్ దాస్య శృంకలాల నుంచి భరతమాత విముక్తి కోసం గాంధీజీ నిర్వహించిన పోరాటం ప్రశంసనీయమన్నారు. ప్రధానంగా గాంధీ నిర్వహించిన సత్యాగ్రహం, అహింసా విధానం ఆదర్శప్రాయమన్నారు. గాంధీజీ బాటలో నేటి తరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతిర్యాల రవి కుమార్, కురిచేటి శ్రీనివాస్, తమ్మల్ల వెంకటేశ్వర్లు, యడారి ప్రదీప్, కొల్లపూడి వరుణ్, శేషు, పందాల సరిత, రామ్ ప్రసాద్, శీలం రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, కాపుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 420 మాటల కాదు హామీలు అమలు చేయాలి..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి గాంధీ అయినా కళ్లు తెరిపించాలి.
- అమలు గాని హామీలతో నిలువునా మోసం.
- బిఆర్ఎస్ నాయకురాలు, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి.
- గాంధీ వర్దంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళి..
- కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని గాంధీ విగ్రహానికి వినతి



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**కాంగ్రెస్ పార్టీ 420 మాటలు బంద్ చేసి హామీలు అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్నా ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని బిఆర్ఎస్ నాయకురాలు, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి విమర్శించారు. గాంధీ వర్దంతి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదేశాల మేరకు, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు సూచనల మేరకు సూపర్ బజార్ సెంటర్ లోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ... హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను ఇచ్చిందని, అందులో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గ్రామ సభల పేరుతో ప్రజలను మభ్య పెడుతూ... ప్రశ్నించిన ప్రజలను, బిఆర్ఎస్ పార్టీ నాయకులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. 420 హామీలను నమ్మి ఓటేసిన పాపానికి గొంతుకోసిన ఈ అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని గాంధీని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తొగరు రాజశేఖర్, అనుదీప్, హుస్సేన్, మాధవిలత, శివ, మైనుద్దీన్, ఖాజా, షరీఫ్, షమ్మీ, మోరే చాణిక్య, శ్రీకాంత్, పూర్ణ చందర్ రావు, సింధు తపస్వి, అక్బర్, ఐలయ్య, జాహీద్, పీటర్, రాజేష్, సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పోలంపల్లిలో కుల దుహంకరణ సమాజానికి సవాళ్లు

రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ కొత్తపల్లి రమేష్



**జనవరి 30, ( సి కే న్యూస్) చేగుంట :**మెదక్ జిల్లా చేగుంట మండల పరిదిలోని పోలంపల్లి గ్రామంలో, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్,ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమేష్ ఆధ్వర్యంలో, సివిల్ రైట్స్ కార్యక్రమం పొలంపల్లి ఎస్సీ కాలనీలో నిర్వహించారు,వారు మాట్లాడుతూ, ఎస్సీ కులస్తులను ఎవరైనా కులం పేరుతో దూషించిన, గుడిలో రాకుండా అడ్డుపడిన, వారి పైన, ఎస్సీ ఎస్టీ అట్రాసిట్ కేస్ కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు, గ్రామంలో ఎవరైనా కులాంతర వివాహం చేసుకున్నట్లయితే వారికి ప్రభుత్వం తరుపున 50 వేల రూపాయలు నగదు. మరియు, విదేశీ చదువుల. కొరకు ఆర్థిక స్తోమత లేకపోతే, విదేశీ చదువు కొరకు వెళ్లాలనుకునే వారికి రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది, అన్నారు, ఈ కార్యక్రమం లో చేగుంట, ఆర్ ఐ, సంతోష్ కుమార్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ కొత్తపల్లి రమేష్, పొలంపల్లి గ్రామ సెక్రెటరీ స్రవంతి, చేగుంట హెడ్ కానిస్టేబుల్, జి సత్తయ్య, రెవెన్యూశాఖ పోలంపల్లి చేగుంట మండల్ మాల మహానాడు మండల అధ్యక్షులు,

కొండి మల్లేశం, టప్ప భాను, వెన్నెలి సత్యం, డిస్ రాజు, యాదగిరి, కిషన్ రమేష్, దుర్గయ్య, బాల్ నర్సింలు, కిషన్ పద్మయ్య, నాగరాజు, టి కిష్టయ్య వై శివ, బాలకృష్ణ, సురేష్, ప్రశాంత్, చందు, ఎస్ స్వామి, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

# డీజిఎం పర్సనల్ రమేష్ సేవలు ప్రశంసనీయం ఏరియా సేవా కార్యదర్శి షేక్ షాకీరా.

ఏరియా ఉత్తమ అధికారి రమేష్ ని సత్కరించిన సేవా సభ్యులు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,**రెండువేల ఇరవై ఐదు జనవరి యిరవై ఆరు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మణుగూరు ఏరియా ఉత్తమ అధికారిగా ఎంపికై కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం చేతుల మీదుగా సన్మానం మరియు ప్రశంస పత్రం అందుకున్న మణుగూరు ఏరియా అధికార ప్రతినిధి డీజీఎం పర్సనల్ సలగల రమేష్ ని గురువారం మణుగూరు ఏరియా సింగరేణి వైవ్స్ అసోసియేషన్ సేవా ఆధ్వర్యంలో శాలువా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా సేవా కార్యదర్శి షేక్ షాకీరా రవూఫ్ మాట్లాడుతూ నిజాయితీకి నిలువుటద్దం రమేష్ గారని సంస్థ పట్ల అంకితభావం తో పాటు బాధ్యతగల అధికారిగా మణుగూరు ఏరియాలో యాజమాన్యానికి కార్మిక సంఘాలకు కార్మికులకు మధ్య తలలో నాలుకలా ఒక వారధిగా పనిచేస్తూ అందరి అభిమానాన్ని చూరగొన్నారని పీవీ కాలనీలో సేవా కార్యాలయ నిర్మాణంలో కూడా రమేష్ సహకారం మరువలేనిదన్నారు. సింగరేణి ఉన్నతాధికారుల అభినందనలు అందుకోవటం ప్రశంసనీయమని ఉద్యోగ పర్వం లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు ఈ సందర్భంగా రమేష్ కి ప్రశంసా పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏరియా సింగరేణి సేవా సమితి కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సింగు శ్రీనివాస్ సమన్వయకర్తగా వ్యవహరించగా ఏరియా సేవా సభ్యులు ఎస్.కె షాకిరా, సంధ్య, మాధవి, శోభ, కతార్, రమా, రేణుక,ఎం సత్య, హేమ, బి సత్య, కనక లక్ష్మి, మాధవి, రాయుడు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ), జనవరి 30,** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ప్రభుత్వ పాఠశాలలో మరియు కళాశాలల ప్రిన్సిపల్ లు మరియు మునిసిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యం లో ఎన్నికల ప్రవర్తన నియమావళి మనలోకి వచ్చిందని ఆయన తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ - కరీంనగర్ స్థానాలతో పాటు వరంగల్ - ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న జారీకానుండగా ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారని, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు గడువు విధించారని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, మార్చి మూడవ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫోటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, బస్టాండ్, పబ్లిక్ పార్ వంటి ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టికర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై ఉన్న రాతలను చెరిపివేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను కవర్ చేయాలన్నారు

## యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాత జాతిపిత..

ఘనంగా మహాత్మా గాంధీ 77వ వర్ధంతి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,** కరకగూడెం మండలం, కరకగూడెం గ్రామంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ స్మారక కరకగూడెం మేనేజర్ నాగ బండి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జాతి పిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ,తదితరులు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అహింసా అనే ఆయుధంతో ఆంగ్లేయులను తరిమికొట్టిన సమరయోధుడు యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రధాత జాతిపిత మహాత్మా గాంధీ గారని, ఆయన చూపిన శాంతియుత మార్గం ద్వారానే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీజీ అని కొనియాడారు..భారత స్వాతంత్ర్య పోరాటాన్ని, గాంధీజీని విడదీసి చూడలేం, అలాంటి మహాత్ముడి జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు..

ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు...

## 71వ జిల్లాస్థాయి సీనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపిక.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మునగాల తుర్కపల్లి గ్రామంలో యాదాద్రి భువనగిరి జిల్లా 71వ సీనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపిక యాదాద్రి భువనగిరి జిల్లా కబడి అసోసియేషన్ ఉపాధ్యక్షులు బుర్ర మహేందర్ ఆధ్వర్యంలో జరిగాయి కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య జిల్లాలోని వివిధ మండలాల గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారుల వారి యొక్క నైపుణ్యతను వారి ఆటా క్రమశిక్షణ చూసి ఫిబ్రవరి నెలలో అదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మన జిల్లా క్రీడాకారులు ఎంపిక చేయడం జరిగింది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లియువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్ గ్రామ మాజీ ఎంపిటిసి పల్సం సతీష్ లి మాజీ సర్పంచు గుండు శేఖర్ వార్డ్ మెంబర్ మరి సత్యనారాయణ గ్రామ శాఖ అధ్యక్షులు నోముల నరేందర్ పెంట రెడ్డి యాదవ సంఘం అధ్యక్షులు ఉడుత శంకరయ్య పల్సం మత్స్యగిరి గ్రామ ప్రజలు యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# సింగరేణి భవన్ లో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం.

**మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలన్న సీ ఎం డీ ఎన్.బలరామ్.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,** దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్రుణ ప్రాయంగా అర్పించిన మహనీయులందరి త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని, వారు కలలు గన్న అభివృద్ధి చెందిన భారత దేశం లక్ష్యాల సాధనకు పునరంకితం కావాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు విభిన్న పంథాలో పోరాటాలను కొనసాగించి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించేందుకు కృషి చేశారన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, మనం ఈ రోజు స్వేచ్ఛగా జీవించడం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన యోధులందరినీ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్, పి అండ్ పి)



జి.వెంకటేశ్వర రెడ్డి, జీఎం (కో ఆర్డినేషన్) ఎస్టి. ఎం. సుభానీ, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ శ్రీ జనక్ ప్రసాద్, జీఎం లలిత్ కుమార్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు పరచాలి.



టిఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి.

**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వలిగొండ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి పట్టణ అధ్యక్షులు అప్రోజుమండల నాయకుల సమక్షంలో.

జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు.

తుమ్మల వెంకటరెడ్డి, ముద్దసాని కిరణ్ రెడ్డి, మీడియా ద్వారా మాట్లాడుతూ.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ ఎలక్షన్ ముందు కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి, తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేసుకొని గెలిచిన తర్వాత,మాట తప్పిన పార్టీ కాంగ్రెస్ పార్టీఅని, తెలంగాణలో సంక్షేమ పథకాలు, ఉచిత కరెంటు, ఫ్రీ బస్సు తప్ప,ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు పూర్తి చేయలేని, కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక ఎలక్షన్లలో ప్రజలు ఓడించి సరైన బుద్ధి చెప్తారని, ఇచ్చిన హామీలు ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ,మీడియా ద్వారా మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మారయ్య, రాజు, రామచందర్, శీను, నాగిళ్లయాదగిరి,నరేష్ రెడ్డి,మల్ల%శీ% నరేష్,బూడిద స్వామి,బాలకృష్ణ,పాల్గొన్నారు.

# అండర్ 15 రగ్బీ సెలెక్షన్స్ అత్యుత్తమైన ప్రతిభ చూపిన 16 మంది , ఎంపిక కోచ్ కరం గణేష్





**జనవరి 30 ( సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల కేంద్రంలో గురువారం 30,01,2025 నాడు చేగుంటలోని ఇండోర్ మల్టీప్లెక్స్ స్టేడియం గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్థాయి అండర్ 15 సెమీ కాంటాక్ట్ రగ్బీ సెలక్షన్స్ కి జిల్లా నలుమూలల నుండి 120 పైబడి క్రీడాకారులు, క్రీడాకారునిలు పాల్గొనగా అందులో నుంచి అత్యుత్తమ ప్రతిభ చూపిన 16 మంది క్రీడాకారునిలు, 16 మంది క్రీడాకారులను సెలెక్ట్ చేయడం జరిగిందని జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం గణేష్ రవికుమార్, మల్లీశ్వరి తెలిపారు.ఎంపికయిన బాలుర విభాగంలో నరేష్ జడ్ .పి.హెచ్ యస్ చేగుంట,అభిచరన్ మెదక్,అఖిల్ రామాయంపేట,మనోహర్ మెదక్,నరేందర్ రామాయంపేట,ధీరజ్ నిజాంపేట్,విట్టు చేగుంట,చైతన్య చేగుంట,రవి,చరణ్ చేగుంట,శివ నిజాంపేట్,హర్షవర్ధన్ రామాయంపేట,బాలు మెదక్, స్టాండ్ బై గా చంద్ర రామాయంపేట,మధుకర్ నిజాంపేట్ కాగా,బాలికల విభాగంలో చేగుంటకు చెందిన లాస్య,గాయత్రి,దేవి,మౌనిక,దివ్య,పవిత్ర,అక్షయ మెదక్ చెందిన సారిభా,సాహితీ,నందిని నిజాంపేట కు చెందిన అరుణ,సంజన ప్రియ ఎంపికవగా,స్టాండ్ బై గా నిహారిక,వర్ష శ్రీ,సాత్విక,మధుప్రియ ఎంపికయ్యారని వారు తెలిపారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర రిఫరీలు నవీన్,మహేష్,మోహన్,పి. డీ లు ప్రవీణ్,స్తుతి గీత,సరిత,దిలీప్,చంటి,కొచ్లు సంతోష్,ప్రభాకర్ పాల్గొన్నారు,ఎంపికైన వీరు ఫిబ్రవరి 1,2,3 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.ఎంపికైన వీరి పట్ల వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు,పి. ఈ. టీ లు హర్షం వ్యక్తం చేశారు.

# గాంధీజీ అహింసా సిద్ధాంతమే దేశప్రజల కు శ్రీరామ రక్ష.

**రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల.**


**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్ ),జనవరి 30,** గాంధీజీ అహింస సిద్ధాంతం ద్వారానే భారతదేశానికి స్వతంత్రం తీసుకొచ్చారని, ఆయన సిద్ధాంతాలే దేశ ప్రజలకు శ్రీరామరక్ష అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.మహాత్ము, జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పాల్వంచ మార్కెట్ లోని లిమహాత్మా గాంధీ విగ్రహానికి సకలజనుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పట్టణానికి చెందిన లివర్తక సంఘం, వ్యాపారస్తులు, వివిధ రాజకీయ పక్షాలు, హమాలీలు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో కొత్వాల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ అహింస వాదంతో ఎంతటి కఠిన లక్ష్యాలనైనా సాధించవచ్చని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి భారతీయుడు ఆయన అడుగుజాడల్లో నడవాలని కొత్వాల కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ వి ఆర్ కే ఆచార్యులు, బ్యాంకు చారి, కొప్పరపు రాము, పసుమర్తి నాగేశ్వరరావు, కుమార్ సార్, మీసా లింగయ్య, సందు ప్రభాకర్, బెల్లంకొండ వాసుదేవరావు, దోర్నాల సతీష్, సునీల్, పెండ్యాల రాము, ఎస్ వి శేషాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలం డిప్యూటీ తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరణ.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 30,** భద్రాచలం డిప్యూటీ తాసిల్దారిగా ధనియాల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు.
గతంలో బూర్గంపాడు తాసిల్దార్ కార్యాలయంలో యుడిసిగా కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసి ప్రస్తుతం ప్రమోషన్లు డిప్యూటీ తాసిల్దార్ పదవి బాధ్యతలు చేపట్టారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## మొగిలిపాకలోగ్రామంలో. మహిళా సంఘాల నిధులను దుర్వినియోగం చేసిన వి బి కే పై చర్య తీసుకోవాలి.

మహిళ సంఘాల సభ్యుల కు పై అధికారులు వెంటనే న్యాయం చేయాలి.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని.
మొగిలిపాక గ్రామంలో మహిళా సంఘలు,నాగలక్ష్మి సంగం, సంతోష్ మాత సంఘం,వారు వి బి కే, నీ నమ్మి, ప్రతి నెల మహిళా సంఘాల నుండి నెలనెలా డబ్బులు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేసేది, ఒకరోజు మేము మహిళా సంఘం సభ్యులము బ్యాంకుకు వెళ్లి తెలుసుకుంటే, ప్రతినెల మీరు వసూలు చేసిన డబ్బులు మా బ్యాంకుకు వచ్చి ఎవరు కట్టలేదని, మీ గ్రామంలో వసూలు చేసిన ఏబీకే ను అడగాలని మహిళా సంఘాల సభ్యులతో చెప్పినారు ,.
, మీడియా ద్వారా గ్రామ పెద్దలు మద్దసాని కిరణ్ రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ, దాదాపు 22 లక్షల వరకు దుర్వినియోగం జరిగిందని ,మహిళా సంఘాలకు జరిగిన అన్యాయాన్ని పై అధికారులకు కంప్లైంట్ ఇచ్చినమని, న్యాయం చేయాలని లేనిపక్షంలో కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి అక్కడ నిరసన తెలుపుతామని, పై అధికారులు స్పందించాలని,కోరినారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యురాలు, సునీత, ఉపేంద్ర,వీరమ్మ, పద్మ, జక్కుల,వెంకమ్మ పూలమ్మ,లావణ్య, అజిత్, బుచ్చయ్య, రమేష్ మచ్చేందర్ మల్లేశం కుమార్ పాల్గొన్నారు

## దక్షిణ నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎండీ ముజీబ్ ఖాన్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 30 :** దక్షిణ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎండీ ముజీబ్ ఖాన్ ని నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి దక్షిణ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ కి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ కి కృత్జ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు 420 హామీలు.

- 420 రోజులైనా అమలు చేయలేదు.
- వేములకొండ మాజీ సర్పంచ్ ఆకుల వెంకటేశం.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 30.**మీడియా ద్వారా మాట్లాడుతూ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ ఎలక్షన్ ముందు కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి, తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేసుకొని గెలిచిన తర్వాత,మాట తప్పిన పార్టీ కాంగ్రెస్ పార్టీఅని , తెలంగాణలో సంక్షేమ పథకాలు, ఉచిత కరెంటు, ఫ్రీ బస్సు తప్ప,ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు పూర్తి చేయలేదని, కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక ఎలక్షన్లలో ప్రజలు ఓడించి సరైన బుద్ధి చెప్తారని, ప్రజా పాలన గ్రామసభలో కూడా అసలు అర్హత ఉన్న వారి పేర్లు లిస్ట్ లో రాలేదని, అధికారుల సర్వే లోపం గ్రామ సభలో కనిపించిందని, నిరుపేదలకు ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలు అదే విధంగా అధికారులు,నాయకులు,చర్య తీసుకోవాలని.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికైనా నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ,మీడియా ద్వారా మాట్లాడినారు.

## ఐటీసీ ఉద్యోగ కార్మికులు మొత్తం శంకరన్న విజయం కోసమే....

ఐ టి సి ఉద్యోగ కార్మికులు....



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జనవరి 30,**సారపాక ఐటిసి కారాగారంలో ఉద్యోగ కార్మికుల ఎలక్షన్ భాగంగా బి ఆర్ ఎస్ మిత్రపక్షాలు బలపరిచి నటువంటి. సిఐటియు. అధ్యక్షుడు సానికొమ్ము శంకర్ రెడ్డిని. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఉద్యోగ కార్మికులు అందరూ కలిసి గెలిపించుకుంటా మంటూ బహిరంగంగా తెలిపారు. ఈసారి మా లీడర్ శంకర్ అన్న అని ఉద్యోగ కార్మికులందరూ గొంతెత్తి చెప్పడం జరుగుతుంది. మేమే కాదు మేమందరం కలిసి మార్పు కోరుకుంటున్నాం. ఈ మార్పులు మా శంకరన్న విజయం సాధించాలని కార్మికులందరూ వన్ సైడ్ అవ్వడం జరిగింది. శంకరన్న విజయానికి విజయ కెరటం ఎగరేయడం పక్క ఐటీసీలో యూనియన్ లీడర్ శంకరాన్ని అంటున్న ఉద్యోగ కార్మికులు. ఎటువంటి పార్టీలకు అనుసంధానం లేనటువంటి ఉద్యోగ కార్మికులు కూడా శంకరన్నకే ఓటు వేస్తామని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇక మా శంకరన్న మా లీడర్ ఎవరు ఎదురొచ్చినా ఎదురు రాకపోయినా మా శంకరన్న నే మేము గెలిపించుకుంటాం ఎవరు ఎన్ని చెప్పినా మేము వినం శంకరన్న బాటలోనే మేము నడుస్తాం. మీ మందు సీసాలకు మీరు పంచే డబ్బులకు మేము లొంగం మాకు కావాల్సింది మంచి నాయకుడు మంచి వ్యవస్థ ఐటీసీ నుంచి మాకు మా కుటుంబాలకు భద్రత మా పిల్లల భవిష్యత్తు శంకరన్న వల్లే సాధ్యమని మేము నమ్ముతున్నాం కాబట్టి శంకర్ అండి మా లీడర్ వారు వన్ సైడ్ శంకరన్న ఐటీసీ లీడర్. అంటున్న ఐటీసీ ఉద్యోగ కార్మికులు.

## రెండో రోజు బండలాగుడు పోటీలను ప్రారంభించిన రావుల



**పెబ్బేరు జనవరి30 (సి కే న్యూస్)**మూడు రోజులపాటు సాగే పెబ్బేరు చౌడేశ్వరి జాతర ఉత్సవాల్లో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర అఖిలభారత ఒంగోలు జాతి పశు బల ప్రదర్శన బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.రెండో రోజు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని చౌడేశ్వరి తల్లి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెబ్బేరు మార్కెట్ యార్డ్ నందు ప్రతి సంవత్సరం లాగే బండలాగుడు పోటీలు ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు ప్రజలకు పశు సంపద ఎంతో ముఖ్యమైనదని మేలు జాతి ఆవులను ఇక్కడ ప్రదర్శించడం హర్షనీయమని అన్నారు.ఈ బల ప్రదర్శన తిలకించడానికి భారీగా జనం తరలి రావడంతో ఎలాంటి ఆహ్వానించనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై హరిప్రసాద్ రెడ్డి గట్టి బందోబస్తు నిర్వహించారు.

# నోటీసులు ఇచ్చాము అంటున్న ఎం పి ఓ ..చర్యలు ఏవి ?



**నోటీసులు ఇచ్చి చర్యలు చేపడితే నిర్మాణం ఎలా పూర్తికావస్తుంది.**

**“జి” ప్లస్ త్రీ అక్రమ నిర్మాణం పట్టించుకోని అధికారులు**

**శ్రీనగర్ పంచాయతీలో అనేక అక్రమ నిర్మాణాలు**

**మాకు ఏమీ పట్టదు అన్నట్టు చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు.**

**చేతులు తడిపితే ఏ నిర్మాణమైన ఇక్కడ చేసుకోవచ్చు.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జనవరి 30,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీలో హద్దులు దాటి జి ప్లస్ త్రీ లిఫ్టుతో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇవేవీ పట్టనట్లు వ్యవహరిస్తు చొద్యం చూస్తున్న పంచాయతీ మండల జిల్లా అధికారులు. 1/70 యాక్ట్ ను తుంగలో తొక్కుతూ లిఫ్ట్ సౌకర్యాలతో జి ప్లస్ త్రీ నిర్మాణాలు చేపడుతున్న ఇవేమీ మాకు పట్టవు అన్నట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు. జి ప్లస్ త్రీ నిర్మనల విషయాలపై ఎంపిఓ శ్రీనివాసరావును వివరణ కోరగా నోటీసులు ఇచ్చాము చర్యలు చేపడతాము అంటున్నారు. మరి నోటీసులు ఇచ్చి చర్యలు చేపడితే నిర్మాణం ఎలా పూర్తిగా వస్తుంది..ఏజెన్సీ చట్టాలు శ్రీనగర్ పంచాయతీకి వర్తించవు అన్న రీతిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న పంచాయతీ సిబ్బంది నోటీసుల ఇచ్చామంటూ చేతులు దులుపుకుంటున్నారు తప్ప వారి పని ఏంటో వారు చేయలేకపోతున్నా పరిస్థితి. ఇదంతా ఒక ప్లాను ప్రకారమే జరుగుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. పునాది వేసినప్పుడే అడ్డుపడాల్సిన పంచాయతీ సిబ్బంది జి ప్లస్ త్రీ నిర్మాణం చేసినా కూడా కల్లుండి చూడలేని రీతిగా వ్యవహరిస్తున్నారని ఎటువంటి సందేహం లేదు. కాసులకు కక్కుర్తి పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.. ప్రతిరోజు పంచాయతీ కార్యాలయాని కి వెళ్లాలంటే ఈ నిర్మాణం దాటి వెళ్ళలి. మండల అధికారులు పంచాయతీలలో పర్యవేక్షించాలి అంటే ఈ జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణం దాటే వెళ్లాలి అలాంటప్పుడు ఎవరికి కనిపించలేదంటూరా లేక ముడుపులు ఏమైనా అందాయ అని అనుకుంటున్న ప్రజలు. శ్రీనగర్ పంచాయతీలో కొత్తగా ఇండ్లు కొనుక్కున్న వాళ్ళ దగ్గర నుండి పేర్లు మార్చడం కొరకు లక్షల వసూలు చేస్తున్నారని వినికిడి. ఇటువంటివి దాదాపు ఈ పంచాయతీ లోనే పదుల సంఖ్యలో ఉన్నాయంటే మొత్తం మండల వ్యాప్తంగా ఎలా ఉందో పరిస్థితి ఊహించుకోవచ్చు. ఇలాంటివ జరుగుతున్నాయి కాబట్టే అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది వీటిని అరికట్టేది ఎవరు? నోటీసులు ఇచ్చామంటూ చేతులు దులుపుకుంటున్నారు . వాటిని ఆపే ప్రయత్నం ఏ అధికారి చేయలేకపోవడం వంటివి చూస్తుంటే శ్రీనగర్ పంచాయతీలో ఏ విధంగా డబ్బు చేతులు మారుతుందో అర్థమవుతుంది. ఇకనైనా జిల్లా అధికారులు కల్పించుకొని అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరుతున్నా ప్రజలు..

## ప్రజల ఆశీస్సులతో వైసిపి బలోపేతం


- దక్షిణ వైసిపి సమన్వయకర్త వాసుపల్లికి ఘనసత్కారం
- దక్షిణంలో పలువురికి వరించిన పార్టీ పదవులు

**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 30 :** ప్రజలు ఆశీస్సులతో మళ్ళీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్కుమార్ స్పష్టం చేశారు. వైసీపీ పార్టీ కోసం కష్టపడిన నాయకులకు కార్యకర్తలకు అధిష్టానం పలు అధ్యక్ష పదవులను అందించిందన్నారు. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గంలో నూతనంగా అధ్యక్ష పదవులకు నియామకమైన పలువురు పార్టీ శ్రేణులు గురువారం వాసుపల్లి గణేష్ కుమార్ ని కలిసి గజమాలతో సత్కరించి జై జగన్.. జై వాసుపల్లి అంటూ ఆనందం వ్యక్తం చేశారు. దక్షిణ నియోజకవర్గంలో పార్టీ కష్ట కాలంలో కూడా శ్రమిస్తున్న పలువురి వైసిపి నాయకులను కార్యకర్తలను గుర్తించి అధిష్టానానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు జిల్లా వైసీపీ ఇటీవల విడుదల చేసిన పలు పదవులకు దక్షిణం నుండి విశాఖ జిల్లా బీసీ అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్ , సౌత్ బూత్ లెవెల్ ప్రెసిడెంట్ ముజుబ్ ఖాన్, వైయస్సార్ టిఎన్టియుసి అధ్యక్షులు రాజ్ పాత్రుడు, సౌత్ బిసి సెల్ అధ్యక్షులు బొండాడ వెంకటరమణ, సౌత్ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ షకిల్, సౌత్ మహిళా విభాగం అధ్యక్షులు వాసుపల్లి బంగారమ్మ, సౌత్ అంగనవాడి వింగ్ అధ్యక్షులు కొంతాల కృష్ణవేణి, సౌత్ సోషల్ మీడియా అధ్యక్షులు మహేష్, సౌత్ వాణిజ్య విభాగం అధ్యక్షులు కడియం ప్రసాద్, సౌత్ మున్సిపల్ వింగ్ అధ్యక్షులు



గోరపాటి శివ ఎన్నికయ్యారు. వీరంతా వాసుపల్లి గణేష్ కుమార్ తో కలిసి పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యలతో నిరంతరం కృషి చేయడం గుర్తించడంతో పలు పదవులు వరించాయి. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడం వైకాపా కి కొత్త ఏమీ కాదన్నారు. కూటమి ప్రభుత్వం అబద్ధాలతో అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు గడిచినప్పటికీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేక పోయిందన్నారు. పైగా జగనన్న నేరుగా అందించిన పథకాలు, సచివాలయాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వాలంటీర్లకు 10 వేలు పెంచుతామంటూ ఉద్యోగాల్లోంచి తీసేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ లో ఒక్క సిక్స్ కొట్టలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటల గారీడీతో మభ్యపెడుతుండడం ప్రజలు గమనిస్తున్నారని వెల్లడించారు. అందుకే మళ్ళీ జగనన్న రాజ్యం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. మళ్లీ వైసీపీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి కరపత్రాలు విడుదల చేసిన ద్రోణం రాజు శ్రీవాత్సవ్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 30 :** ఫిబ్రవరి1వ తేదీన, స్వర్గీయ. ద్రోణంరాజు. శ్రీనివాస్ 64వ జయంతి సందర్భంగా, శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సంస్థ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి శ్రీనివాస్ తనయులు శ్రీవాత్సవ పత్రాలను విడుదల చేశారు. శ్రీవత్సవ మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరుపబడును, కాటరాక్ట్ శాస్త్ర చికిత్సలు, కంటిమీద కండ, మెల్లకన్ను సరి చేయుట అందరికీ కూడా ఉచిత వైద్య పరీక్షలు అందించబడును , అందరూ కూడా ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవలసినదిగా శ్రీవాత్సవ్ కోరారు. ద్రోణం రాజు. శ్రీనివాస్ జయంతి సందర్భంగా వివేకానంద సంస్థ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, క్యాంపు కోఆర్డినేటర్ వై . రాజు, ప్రసాద్, కాలా. సూర్య ప్రకాష్ మరియు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## వేములపల్లి మండల పరిధిలో పలు గ్రామాలలో సోలార్ ప్రాజెక్ట్ కోసం స్థల పరిశీలన





**వేములపల్లి సీకే న్యూస్ జనవరి 30:**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా సంఘాల బలోపేతం మరియు మహిళా అభ్యునతి కోసం రాష్ట్ర వ్యాప్తంగ సోలార్ ప్లాంట్ల ప్రాజెక్టు మహిళా సంఘాలకు వప్పజెపుతూ నిర్ణయం తీసుకోవడంతో ఇందులో భాగంగా వేములపల్లి మండల పరిధిలో కొన్ని గ్రామాలను సెలక్ట్ చేయడంతో సెలక్ట్ చేయబడిన గ్రామాలయిన శెట్టిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని ముండ్లపహాడ్,లక్ష్మి దేవి గూడెం,బుగ్గబాయ్ గూడెం గ్రామాల మహిళా సంఘాలకు కేటాహించడంతో గురువారం పీడి వై.శేఖర్ రెడ్డి,సబ్ ఇంజనీర్ కృష్ణ రెడ్డి,ఎమ్ఆర్వో పుష్పలత వీరంత కలిసి ఆయా గ్రామాలలో స్థల పరిశీలన చేశారు ఈకార్యక్రమం లో ఏపిఎమ్ గోపి,సోలార్ డిఎం మరియు వీఏవోఎలు,వోబీలు పాల్గొన్నారు

## క్రిమి సంహారక మందులు, ఎరువుల దుకాణాల పై ఆకస్మిక తనిఖీలు

**కల్లూరు, సీకే న్యూస్ జనవరి 30**–పులిచెర్ల మండలం కల్లూరులో గురువారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగపద్మిని, చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ శాఖ అధికారిణి ప్రసన్న లక్ష్మి క్రిమి సంహారక ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో ఎరువులు, పురుగుమందుల స్టాకు, నిల్వ ధరల పట్టిక, రైతులకు అమ్ముతున్న పురుగుమందుల బిల్లులు, తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిమిసంహారక పురుగుల మందులు, ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, అమ్మినవాటికి బిల్లులు ఉండాలని అధిక ధరలకు అమ్మితే



కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరి వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి హరిప్రసాద్ ఉన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత పరంజ్యోతి



**జనవరి 30 ( సీ కే న్యూస్) చేగుంట.** చేగుంట మండల కేంద్రానికి చెందిన కమ్మరి లక్ష్మణ్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు,వాసవియన్ అయిత పరంజ్యోతి కుటుంబ సభ్యులను పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మణ్ కుమారుడు గతంలోనే చనిపోవడంతో మనుమరాళ్లకు 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కమ్మరి సత్యనారాయణ, నాగభూషణం,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు......

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఖమ్మం టూరిజంకు బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో, ట్యాగ్ లైన్ తయారి
- జమలాపురం వద్ద అటవీ పార్క్, కాటేజి పనులు పూర్తి చేయాలి
- పాలేరు లేక్ వద్ద పర్యాటకులు పెరిగేలా చర్యలు చేపట్టాలి
- పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -30:**జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు.నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా, పులిగుండాల ప్రాజెక్ట్, వెలుగుమట్ల అర్బన్ పార్క్ వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల గురించి, ఎకో టూరిజంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు.

జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల వద్ద తలపెట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత స్థితిగతులను వివరిస్తూ జిల్లా అటవీ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పర్యాటకంగా జిల్లా అభివృద్ధికి, ప్రత్యేకంగా ఖమ్మం జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్ వద్ద 40 ఫీట్ల రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్కింగ్ ఏరియా ఉండాలని, లోపల ఎటువంటి ప్లాస్టిక్ అనుమతించడానికి వీలులేదని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను ప్లాస్టిక్ ఫ్రీ చేయాలని, లోపల క్యాంటీన్ లో కూడా ప్లాస్టిక్ ఉండవద్దని అన్నారు.

వెలుగు మట్ల అర్బన్ పార్క్ లో చిన్న పిల్లల ప్లే ఏరియా, బోటింగ్ ఏరియా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అన్నారు. పార్క్ లోపల రోడ్డు నిర్మాణం చేయాలని అన్నారు. పులిగొండలో క్యాంప్ సైట్ క్రియేట్ చేసుకునే విధంగా పనులు పూర్తి చేసి ఏకో టూరిజం ట్రిప్ నిర్వహించాలని కలెక్టర్ అన్నారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్, పులిగొండ పర్యాటక ప్రాంతాల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, వీటికి వచ్చే మార్గాలను వివరిస్తూ కూడా బోర్డులు ఏర్పాటు చేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.

ఖమ్మం జిల్లా పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజం కు బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో, ట్యాగ్ లైన్ తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్క్, కాటేజీ అభివృద్ధి పనులు డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

పాలేరు లేక్ వద్ద పిక్నిక్ స్పాట్ అభివృద్ధి చేయాలని, ఇక్కడ ప్రజలు అధికంగా వచ్చేలా జాతీయ రహదారి దగ్గర ప్రచార హెూర్డింగులు ఏర్పాటు కావాలని అన్నారు. పాలేరు లేక్ వద్ద బోటింగ్, క్యాంటీన్, పిక్నిక్ స్పాట్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, బర్డ్ వాచింగ్ సౌకర్యం సిద్ధం చేయాలని, దీని నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.

ప్రతి పర్యాటక ప్రాంతం వద్ద టాయిలెట్స్ శుభ్రంగా మెయింటేన్ చేయాలని అన్నారు. పురావస్తు శాఖ పరిధిలో ప్రదేశాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, సెల్ఫీ పాయింట్ లు ఏర్పాటు చేయాలని అన్నారు.

ఖమ్మం ఖిల్లా వద్ద రోప్ వే నిర్మాణ పనులకు ప్రజలతో చర్చించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రోప్ వే కు 500 కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ ఏరియాను గుర్తించాలని అన్నారు.

ఖమ్మం ఖిల్లా వద్ద పురావస్తు శాఖ సమన్వయంతో ముందుగా అవసరమైన మరమత్తులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలని, స్కూల్ విద్యార్థులు, జర్నలిస్టులు, జిల్లా అధికారులతో ఖిల్లాకు హిస్టరీ వాక్ ప్లాన్ చేసుకోవాలని, జాఫర్ బావి వద్ద మార్చి నెలలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించేలా ప్లాన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, టూరిజం జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, ఇరిగేషన్, దేవాదాయ, అటవీ, రెవిన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చౌటుపల్ హైటెక్ మోటారో రూమ్ లో హీరో డేస్టిని 125 వాహనాన్ని ప్రారంభించిన చౌటుపల్ సీఐ మన్మధ కుమార్



**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) జనవరి 30**
నూతనంగా వెలువడిన హీరో డేస్టిని 125 సూటర్ చౌటుపల్ సీఐ మనద్ధ కుమార్ చేతులమీదుగా గురువారం ప్రారంభం చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతు.. ఇట్టి అవకాశన్నిపరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం షోరూం యజమాని బొంగు రాజు గౌడ్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్నసూటర్ రంగంలో సరికొత్త హంగులతో వాహనదారులు అనుకున్న అన్నిరకాల నైపుణాలతో సూటర్స్ అన్నిరంగాల్లో ఇపటిదాకా అగ్రగామిగా అన్నిమోడల్ దీటుగా హీరో డెస్టిని 125 అందుబాటులో ఉనదని తెలిపారు. ఉన్నఈ కారక్రమంలో ఎస్సీసెల్ బ్లాక్ కాంగ్రెస్ అధక్షులు ఊదరి నరసింహ, బార్ అసోసియేషన్ అధక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, గుండెగోని లింగసామి గౌడ్, ఉషకుల శ్రీనివాస్,చెరుకు సత్యనారాయణ తదితర షోరూం బృందం పాల్గొనారు.

# మహిళలు అన్నిట్లో సమానమే దృఢంగా ఉండండి.

**విద్యార్థుల అవగాహన సదస్సులో డాక్టర్ బిందు పల్లవి.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), జనవరి 30,**ప్రియదర్శిని కాలేజ్ లో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ప్రముఖ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ బిందు పల్లవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల కు వారి ఆరోగ్యం, సమాజంలో ఎలా ఉండాలి, ఎటువంటి జాగ్రత్త తీసుకోవాలనే విషయం లో అవగాహనా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. మహిళలు అన్నిట్లో సమానమేనని పోటీ పరీక్షల్లో పోటీ పడాలని విద్యార్థులు ఒత్తిడికి లోన కాకుండా యోగ వ్యాయామం వంటివి చేయాలని సూచించారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కోసం, స్వీయ రక్షణ కు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. చిన్న ఆరోగ్య సమస్య ఉన్న అలసత్వం చేయకుండా శ్రద్ధ వహించాలని విద్యార్థులు వీలైనంత వరకు వైద్య సహాయం అందిస్తానని హామీని ఇచ్చారు.

# వల్లూరు రోడ్డుపై చిరుత మృతి

**44వ జాతీయ రహదారి పై ఘటన**



**జనవరి 30 ( సీ కే న్యూస్) చేగుంట :**
నర్సింగ్ మండలం వల్లూరు గ్రామం అడవి ప్రాంతంలోనుంచి చిరుత పులి జాతీయ 44 రహదారిపై రోడ్డు పైకి చిరుత పులి రావడంతో మోటార్ సైకిల్ పై వెళుతున్న వెళుతున్న ప్రయాణికులు చిరుత పులిని చూసి, రోడ్డుపై వాహనాలు, నిలిచిపోవడంతో, ఒకేసారి వాహనాలు వెళ్లడంతో, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదంలో చిరుత మృతి చెందడం జరిగింది ఘటన గురువారం నాడు రాత్రి నార్సింగి మండల పరిధిలోని వల్లూరు వద్ద44వ జాతీయ రహదారి పై చోటు చేసుకుంది. ఫారెస్ట్ అటవీశాఖ అధికారులు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి చిరుతపులి మృత దేహాన్ని పరిశీలించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు, హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న డీఎఫ్ఓ జ్యోతి, రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ లకు అప్పజెపడం జరిగింది,

# గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్ లో చేర్చి,అధికారిక భాషగా గుర్తించాలి.

- ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసి ఏజెన్సీలో 100 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలి
- సేవాలాల్ మహారాజ్ జయంతికి దేశవ్యాప్తంగా సెలవు దినం ప్రకటించాలి
- ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 30,**
టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాలో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ తెలంగాణ ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసి ఏజెన్సీలో 100% ప్రభుత్వ ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలి అందు కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని

దేశవ్యాప్తంగా లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్ లో చేర్చి, అధికారిక భాషగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతికి దేశవ్యాప్తంగా సెలవు దినం ప్రకటించాలని కోరారు.గిరిజన చట్టాలైన 1/70, పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో లంబాడీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ శ్రీనివాస్ నాయక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ నాయక్, రవి నాయక్ రాంజీ నాయక్ హనుమంతు జిల్లా ప్రధాన , బాబురావు, బద్రు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెర్ల లో అడవి దున్న హల్ చల్



రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు

**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూర్(ఎం) జనవరి 30 పల్లెర్ల గ్రామ శివారులో పెసర్ల బండ దగ్గర ఉన్న అరకు తోటలోకి అడవి దున్న సంచారిస్తూ హల్ చల్ చేసింది అక్కడే ఉన్న ఓ రైతు చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా హుటాహుటిగా చేరుకున్న ఫారెస్ట్ అధికారులు డిస్ట్రిక్ ఫారెస్ట్ అధికారి పద్మజ మాట్లాడుతూ పల్లెర్ల, రాఘవాపురం, నర్సాపురం గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అడవిదున్న సురక్షితమైన ప్రదేశానికి తీసుకెళ్తామని అన్నారు.రైతులు తమ వ్యవసాయ పొలాల దగ్గర విద్యుత్ షాక్ ఏర్పాట్లు చేయొద్దని ఒకవేళ ఎవరైనా చేస్తే వెంటనే తొలగించాలని తెలిపారు. భువనగిరి రేంజ్ అధికారి రమేష్ నాయక్ మాట్లాడుతూ చాలా సంవత్సరాలనుండి కనపడలేదు అడవి దున్న ఇప్పుడు కనిపించడం జరిగింది ప్రజలు జాగ్రత్తగా తమ వ్యవసాయ బావి దగ్గరకి చూసుకుంటూ పోవాలి గ్రామ ప్రజలు మాకు సహకరించగలరు అని అన్నారు.చుట్టూ పక్కన ఉన్న గ్రామ ప్రజలు భారీగా అడవి దున్న చుడానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు బిట్ అధికారి ఎస్ కిష్టయ్య ఎంపీవో లోకేశ్వర్ రెడ్డి సెక్రటరీ నరేష్ చౌటుప్పల్ రేంజ్ అధికారి సతీష్ బాబు ఫారెస్ట్ అధికారులు, నజియా, కళ్యాణి, మీరాజ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శ



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,జనవరి 30,**ఇల్లందు పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ సమీపంలో గల 6వ వార్డుకు ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు గౌరిశెట్టి పురుషోత్తం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం వారి ఇంటి వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ త్వరగా కోలుకొని మరల పలువురికి మీ ద్వారా మంచి, మంచి సేవా కార్యక్రమాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ, యువజన సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, శ్రీ హరి హర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయం డైరెక్టర్లు కండె రమేష్, పల్లెర్ల చంద్రశేఖర్, వ్యామసాన్ని జనార్దన్ రావు, గోరంట్ల విజయ్, రవి కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నిమిత్తం విద్యార్థికి ఆర్థిక సహాయం. మద్దుల వెంకట కోటయ్య.



**చిలకలూరిపేట: సి కె న్యూస్** పట్టణంలోని 38వ వార్డు లో వైయస్సార్ కాలనీ నందు ఇస్లావతు సాత్విక ఎనిమిదో తరగతి చుదువుతుంది. కీర్తి రూరల్ డెవలప్మెంట్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల వెంకట కోటయ్య రూ 7000వేలు ఫీజుల నిమిత్తం సహాయం చేయడం జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు జంగా వినాయక రావు చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందని గురువారం ఆయన తెలిపారు.మద్దుల వెంకట కోటయ్య గెస్ట్ హౌస్ నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ 2009వ సంవత్సరంలో కీర్తి రూరల్ డెవలప్మెంట్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీని స్థాపించడం జరిగిందని, పేద విద్యార్థిని, విద్యార్థులకు, తమ వంతుగా చేయూతను అందించడమే కాకుండా ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా పలు గ్రామీణ ప్రాంతాల్లో అగ్నికి ఆహుతి అయి సర్వం కోల్పోయిన కుటుంబాలకు సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు. మును ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు.

# ఫిబ్రవరి 12 లోపు నీటి వనరుల ఆక్రమణలు గుర్తించి నివేదిక అందించాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- నీటి వనరుల ఆక్రమణ, భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -30:**ఫిబ్రవరి 12 లోపు నీటి వనరుల ఆక్రమణలు గుర్తించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నీటి వనరుల ఆక్రమణ, భూసేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, మున్నెరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతి 45 మీటర్లకు ఒక విభాగంగా పరిగణించి వాల్ నిర్మించడానికి ఒక బే యూనిట్ అంటారని, మొత్తం 17 కిలో మీటర్ల స్ట్రెచ్ లో 345 పైగా బే యూనిట్ లుగా నిర్మించాల్సి ఉంటుందని, వీటిలో 8.5 కిలో మీటర్ వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.

మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ముందు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వాల్ నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు పట్టాదారు వారీగా మ్యాపింగ్ చేసి వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు.



పట్టాదారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ భూ సేకరణ వేగవంతంగా జరిగేలా చూడాలని, రాబోయే 15 రోజులలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. భూమి అప్పగించే కొద్ది భూ సార పరీక్షలు చేసి వాల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అవసరమైతే అదనపు బృందాలను రంగంలోకి దింపి పనులు యుద్ధ ప్రాతిపదికన చేసి జూలై వరకు రెటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ మ్యాప్, నీటిపారుదల మ్యాప్, టౌన్ ప్లానింగ్ రికార్డులను పరిశీలించి సమన్వయంతో గుర్తించి ఫిబ్రవరి 12 లోపు వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఇర్రిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవిన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలోగా టిజి ఐపాస్ దరఖాస్తులను పరిష్కరించాలి ....



- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
- టీ-ప్రైడ్ ద్వారా 10 యూనిట్ల ఏర్పాటుకు 33 లక్షల 39 వేల పెట్టుబడి సబ్సిడీ
- జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించిన అదనపు కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -30:**జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి-ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులపై నిర్దేశిత సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్, టి - ప్రైడ్ పై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును అదనపు కలెక్టర్ ఆరా తీశారు.

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 22 ప్రతిపాదనలలో 15 ప్రతిపాదనలకు వివిధ శాఖల వారు జారీ చేసిన అనుమతులను, తిరస్కరించిన 3 ప్రతిపాదనలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న 4 ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 10 ఎస్సీ, ఎస్టీ యూనిట్లకు 33 లక్షల 39 వేల 282 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ టి. సీతారాం, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలు మరింత మెరుగ్గా నిర్వహించాలి......

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ
- గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని రెగ్యులర్ గా మానిటర్ చేయాలి
- ప్రీ స్కూల్ లో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలి
- మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -30:**జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు.

గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో మహిళా, శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

పోషణ అభియాన్, ప్రీ స్కూల్ నిర్వహణ, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, లబ్ధిదారుల వివరాలు, అనీమియా నివారణ మొదలగు వివరాలను అదనపు కలెక్టర్ తెలుసుకొని ఖమ్మం అర్బన్, రూరల్, తిరుమలాయపాలెం, మధిర, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి సిడిపిఓలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సంక్షేమ శాఖ పరిధిలో తక్కువ పని తీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడీ టీచర్ల హాజరు, పనితీరును రెగ్యులర్ గా మానిటర్ చేయాలని అన్నారు.

గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకుంటున్నారా లేదా ఐరన్ మాత్రలు వేసుకుంటున్నారా అనే అంశంపై



నిరంతరం పర్యవేక్షణ చేయాలని, గర్భిణీ మహిళలకు సంబంధించి ప్రతి అంశాన్ని ట్రాక్ చేసుకునేలా అంగన్వాడీ కేంద్రాల వద్ద వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్, చెక్ అప్ సకాలంలో జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ప్రీ స్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని, పిల్లల ఎదుగుదలను వంద శాతం మానిటరింగ్ చేయాలని, పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యే విధంగా చూడాలని, గుడ్లు, బాలామృతం ప్లస్ కు ఎటువంటి లోటు రాకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

పోషణ లోపంతో ఎత్తు తక్కువ, బరువు తక్కువ గల పిల్లలను గుర్తించాలని, వారి కోసం నిర్దేశించిన సూపర్వైజ్డ్ సప్లిమెంట్ ఫీడింగ్ చేస్తూ, ఆ కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సకాలంలో ఓపెన్ చేయాలని, న్యూట్రిషన్, పిల్లలకు సంబంధించి వాస్తవిక పరిస్థితులు రిపోర్ట్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలలో నూతనంగా మంజూరు చేసిన టాయిలెట్స్, ఇతర మౌళిక వసతుల కల్పన, మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారిని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీఓ లు, ఏసిడీపీఓలు, డిఎంసి డిహెచ్ఇడబ్ల్యు ఎస్డీ. సమ్రిన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పార్క్ ఆటోమోటివ్స్ లో హీరో డెస్టిని 125 సిసి బైక్ ఆవిష్కరణ






**సికె న్యూస్ ప్రతినిధి:**ఖమ్మం మమతా రోడ్‌లోని ప్రముఖ ద్విచక్ర వాహన డీలర్ స్పార్క్ ఆటోమోటివ్స్ లో హీరో డెస్టిని 125 సిసి బైక్ ఘనంగా ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమాన్ని ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ ప్రారంభించారు.

కార్యక్రమంలో లేడీ డాక్టర్లు, లేడీ కార్పొరేటర్లు, మరియు బిగ్ బాస్ 5 విజేత సన్నీ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

స్పార్క్ ఆటోమోటివ్స్ అధినేత గోలీ అనూప్ మాట్లాడుతూ, "హీరో డెస్టిని 125 సిసి ఖమ్మం ప్రజల ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరుస్తుందని ఆశిస్తున్నాం," అని తెలిపారు.

బైక్ ప్రత్యేకతలు: 125 సిసి ఇంజిన్: శక్తివంతమైన ప్రదర్శన, స్మార్ట్ ఫీచర్లు: ఆటో హెడ్ ల్యాంప్ ఆన్, ఆధునిక డిజైన్, అధునాతన సేఫ్టీ ఫీచర్లు సందర్శించండి. ఈ కొత్త మోడల్‌ను ప్రత్యక్షంగా చూసి రైడ్ అనుభవించేందుకు మా షోరూమ్‌ను తప్పక సందర్శించండి.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జే ఐ హెచ్ నాయకులు



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం జనవరి 30 :** జమాఅత్-ఎ-ఇస్లామీ హింద్ (జెఐహెచ్ ) నాయకులు గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో పాటు ఇతర జిల్లా ఉన్నత అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జమాఅత్-ఎ-ఇస్లామీ హింద్ (జెఐహెచ్) గత 75 సంవత్సరాలుగా మన దేశంలో ప్రజల సేవలో నిమగ్నమై ఉంది. జెఐహెచ్ పేదలు, నిరుపేదలకు సహాయం చేయడం, విధవరాలుకు ఆర్థిక సహాయం అందించడం, అనాధలు మరియు నిరుపేద పిల్లలకు విద్యా సహాయం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని కలెక్టర్కు వివరించారు. జే ఐ హెచ్ తరపున ప్రచురితమవుతున్న గీటురాయి , రెడియన్స్ పత్రికలతో పాటు సంస్థ డైరీలను అందజేశారు. ఇటీవల ఖమ్మం మున్నేరు వరద బాధితులకు జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ముజమిల్ ఖాన్ వారి మాటలను సావధానంగా విని , అభినందనలు ప్రకటిస్తూ కూడా ఇదే విధమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండాలని ఆకాంక్షించారు. అనంతరం జెఐహెచ్ నాయకులు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్ గౌస్ ను కలుసుకున్నారు. ఆయనకు కూడా డైరీ , గీటురాయి , రెడియన్స్ అందజేసి , జే ఐ హెచ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను తెలిపారు. తదనంతరం డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ బి . పూర్ణాదర్ ను కలుసుకొని ఆయనకు కూడా డైరీ, గీటురాయి,రెడియన్స్ పత్రికలను అందజేసి , తాము చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జే ఐ హెచ్ జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా , మాజీ జిల్లా అధ్యక్షుడు అబ్రార్ అలీ , ఖిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మలిక్ , నాయకులు ఎజాస్ , మోయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.